క్లుప్తంగా

విత్తన దుకాణాల్లో అధికారుల తనిఖీలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని విత్తన దుకాణాల్లో వ్యవసాయాధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సత్తెనపల్లి ఏడీఏ ఎస్. శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆథరైజ్డ్ కంపెనీ నుంచి సర్టిఫికెట్ కలిగిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలని, ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ ఎస్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు ఎస్‌ఐగా అనిల్‌కుమార్



ఈపూరు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ ఫిరోజ్ ఖాన్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో తాత్కాలిక ఎస్‌ఐగా జి.అనిల్‌కుమార్‌ను జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ నియమించారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటానని అనిల్‌కుమార్ తెలిపారు.

ఏదీ వృథా పోదు..



పెదకూరపాడు: పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు గ్రామానికి చెందిన సామాజిక వేత్త ఘంటా గోపి ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని సొంత వాహనంలో సేకరించి అభాగ్యులకు అందిస్తున్నారు. సోమవారం పెదకూరపాడులోని ఓ శుభకార్యంలో 500 మందికి సరిపడా ఆహారం మిగిలిపోయింది. విషయం తెలుసుకున్న ఘంటా గోపి సొంత వాహనంలో ఆహారం తీసుకొచ్చి అమరావతిలోని ఎస్టీ కాలనీలోని సంచార జాతులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ జిల్లా పరిధిలో శుభ కార్యక్రమాల్లో మిగిలిన ఆహారాన్ని వృథా చేయవద్దని, 97050 78403కు సమాచారం ఇస్తే సామాజిక సేవకులతో కలిసి సొంత వాహనంలో ఆహారాన్ని సేకరించి పేదలకు అందజేస్తామన్నారు. గోపి వెంట హిదాయతుల్లా, రావులపాటి అనిల్ ఉన్నారు.

నూరుశాతం విద్యాకానుక కిట్లు

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు నూరుశాతం విద్యాకానుక కిట్లు అందజేస్తామని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు తెలిపారు. సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 39 ప్రభుత్వ పాఠశాలలున్నాయని, ఆయా పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులందరికీ విద్యా కానుక కిట్లు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకుగాను 1 నుంచి 10వ తరగతుల వరకు 24 వేల 218 పాఠ్య పుస్తకాలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 12 వేల 957 పాఠ్య పుస్తకాలు అందజేశామన్నారు. నోట్ పుస్తకాలు 13 వేల 496, బ్యాగ్స్‌లు 2398 మంజూరైనట్లు తెలిపారు. ఆయనతో పాటు సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఏలికా శ్రీనివాసరావు, ఎంఆర్‌సీ సిబ్బంది లింగాల శ్రీహరి, బోయపాటి తివిక్రమ్, మస్తాన్‌రావు తదితరులు ఉన్నారు.

సొసైటీ చైర్మన్ పదవికి చెన్నయ్య గుడ్‌బై

శావల్యాపురం: స్థానిక సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య తన పదవికి రాజీనామా చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా పత్రాన్ని నరసరావుపేట డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీ అధికారులకు అందజేసినట్లు చెన్నయ్య తెలిపారు.

నేడు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ముప్పాళ్ల: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడిపై ఈ నెల 11 నుంచి పచ్చిరొట్ట విత్తనాలు అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ తెలిపారు. జనుము, జీలుగలు 10 కేజీలు చొప్పున సంచి, పిల్లిపెసర 8 కేజీల చొప్పున ఒక సంచి అందించటం జరుగుతుందన్నారు. ఎకరాకు ఒక సంచి చొప్పున అందిస్తామని, జనుములు, జీలుగలు కేజీ రూ.88లు కాగా, సబ్సిడీ పోను రైతు రూ.44లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పిల్లిపెసర కేజీ రూ.134లు కాగా, సబ్సిడీ పోను రూ.67లు రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో వీఏఏలను సంప్రదించవచ్చని తెలిపారు.

13న మోగనున్న బడిగంటలు



- ఎమ్మార్సీస్‌కు చేరిన పాఠ్య, రాత పుస్తకాలు
- విద్యా సామగ్రి పంపిణీకి సిద్ధం



గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జెడ్పీహైస్కూల్

నాదెండ్ల: పాఠశాలల బడిగంటలు గురువారం నుంచి మోగనున్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కావల్సి ఉండగా అమరావతిలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం 12న జరగాల్సిన ఉన్నందున ఉపాధ్యాయుల సంఘాల కోరిక మేరకు 13కు వాయిదా పడింది. వేసవి సెలవుల అనంతరం విద్యార్థుల ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పాఠశాలలకు పాఠ్య, రాత పుస్తకాలతో పాటు యానిఫాం, బ్యాగ్స్, టై, బెల్టులు, తదితర విద్యాసామగ్రి మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయి. మండలానికి 46,646 కిట్లు రావల్సి ఉండగా, ఇప్పటికే 32,140 కిట్లు చేరాయి. ఈ విద్యా సంవత్సరంలో 5283 మంది విద్యార్థులకు గానూ, వీరిలో బాలురు 5217 కాగా, 2066 బాలికలు ఉన్నారు. ఇప్పటికే 9,10 తరగతులకు సంబంధించి అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు వచ్చాయి. 1-7 తరగతులు పాఠ్య పుస్తకాలు 25 శాతం చేరాయి. మంగళ, బుధ వారాల్లో పూర్తిస్థాయిలో వస్తాయని తెలిపారు.



నాదెండ్ల ఎమ్మార్సీస్‌కు చేరిన పాఠ్య, రాత పుస్తకాలు

పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధం

ఈ విద్యా సంవత్సరం పునః ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లా కేంద్రాల నుంచి ఎమ్మార్సీలకు చేరాయి. మండల పరిధిలో మొత్తం 52 ప్రాథమిక పాఠశాలలు, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, చిరుమామిళ్ల ఏపీ మోడల్ స్కూల్, నాదెండ్ల కేజీబీవీ పాఠశాల ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఇప్పటికే 5217 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

సిద్ధం చేశాం

ఒకటి నుంచి పదో తరగతి వరకు సెమిస్టర్-1,2గా విభజించి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. మండలంలోని తరగతుల వారీగా విద్యార్థులకు అవసరమైన పాఠ్య, రాత పుస్తకాలను అందించనున్నారు. పునః ప్రారంభానికి ఒకరోజు ముందే వీటిని అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

– ఈమని కృష్ణారెడ్డి, ఎంఈవో నాదెండ్ల

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించుకోవాలి

న్యాయమూర్తి ఎం.మురళీ గంగాధర్‌రావు

పిడుగురాళ్ల: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ ఆదేశాలతో ఈ నెల 29న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. మురళీ గంగాధర్ రావు అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు నందు పోలీస్ అధికారులతో లోక్ ఆదాలత్‌కు సంబంధించిన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులను, కుటుంబ తగాదాలు, ప్రీ...లిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని తెలిపారు. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా పోలీస్ అధికారులు రాజీ పడగిన కేసులను రాజీ పడేలా చేసి ఎక్కువ కేసులను రాజీ మార్గం చేయాలని ఆయన పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎం.మురళీ గంగాధర్‌రావు

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ఫిరంగిపురం: గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని వైద్యాధికారి పి.ఎస్తేరురాణి అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన 36 మంది గర్భిణులకు రక్త, మూత్ర సంబంధిత పరీక్షలు, ఎత్తు, బరువులు చూసి మందులుఅందజేశారు. ఈసందర్భంగా ఆరోగ్యసిబ్బంది గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. పోషక విలువలు ఉన్న తృణ ధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, కోడిగుడ్లు, పాలు వంటివి తీసుకోవాలని సూచించారు. వాటితో పాటు ప్రతి నెల పరీక్షలు చేసి ఐరన్, కాల్షియం, పోలిక్, బీకాంప్లెక్స్ వంటి మాత్రలు అందజేస్తామని చెప్పారు. పరీక్షలు చేసి రక్త హీనత ఎక్కువగా ఉంటే వారికి ఐరన్ సిక్రోజ్ వైద్యుల పర్యవేక్షణలో అందిస్తామని పేర్కొన్నారు. అవసరమైన మెరుగైన చికిత్సకోసం పెద్ద వైద్యశాలకు రిఫర్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఎస్తేరురాణి

పౌష్టికాహారం పంపిణీ

పెదకూరపాడు: మండలంలోని హుస్సేన్ నగరం గ్రామానికి చెందిన మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 త్యాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల నిమిత్తం హాజరైన గర్భిణులకు, బాలింతలకు గైనకాలజిస్ట్ డాక్టర్ విద్య, డాక్టర్ రమేష్ చేతుల మీదుగా పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్య మాట్లాడుతూ ప్రతి ఏడాది గర్భిణులకు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. గర్భందాల్చిన నాటి నుంచి బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ విద్య, డాక్టర్ రమేష్

వీధి దీపాలన్నీ వెలిగేలా చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వీధి దీపాలన్నీ వెలిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు.వీధి దీపాలపై ప్రజల నుంచి అందే ఫిర్యాదులు 48 గంటల్లో పరిష్కరించడానికి ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆమె చెప్పారు. సోమవారం తన చాంబర్‌లో నగరంలో వీధి దీపాలు, తాగునీటి సరఫరా, అవుట్ ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత పనులు తదితర అంశాలపై ఎస్ఈ, ఈఈలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధి దీపాల మరమ్మతులు, అవసరమైన మెటీరియల్ కోసం ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని చెప్పారు. ఎస్ఈ క్షేత్రస్థాయిలో పరిశీలించి తనకు నివేదిక పంపాలని ఆమె సూచించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కంప్లైంట్ సెల్‌కు అందే ఫిర్యాదులు, వాటి వివరాలను ప్రతి రోజు తనకు ఇవ్వాలని ఆదేశించారు. నగరంలో ప్రతి రిజర్వాయర్‌ను నిర్దేశిత షెడ్యూల్ మేరకు శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరాలో కలుషిత నీటి సరఫరాపై అందే ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండాలని తెలిపారు. ఏఈల వారీగా ఎమినిటీ కార్యదర్శులు తాగునీటి సరఫరా సమయాల్లో శాంపిల్స్ తీసి వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాల సీజన్ ప్రారంభం అయినందున నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా ఏఈలు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలో ప్రధాన ఔట్ ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత పనుల్ని ఈఈలు నేరుగా పరిశీలించాలని చెప్పారు. పూడిక సంపూర్ణంగా తీయకపోతే రానున్న వర్షాలకు పొంగి సమస్యలు వస్తాయని తెలిపారు. పూడిక తీస్తున్న ప్రాంతాల్లో ముందు, తర్వాత ఫొటోలు గ్రూప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు. పూడిక తీసే ప్రాంతాల్లో ఆక్రమణలు ఉంటే పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ శ్యామ్ సుందర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష మోదక హోమం

నగరంపాలెం: శుద్ధ చవితి పురస్కరించుకుని కోట నాగరాజశర్మ అవధాని ఆధ్వర్యంలో సంపత్‌నగర్‌లోని హరి సన్నిధి ఆధ్యాత్మిక సేవా సంస్థలో సోమవారం లక్ష మోదక (కుడుములు) హోమం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గణపతి మూల మంత్రాలతో చతురావృత క్షీర తర్పణం కన్నుల పండువగా జరిపారు. అనంతరం హోమశాలలో విశేష ద్రవ్యాలు, మూల మంత్రాలతో గణపతి హోమం నిర్వహించారు. వేదక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజశర్మ మాట్లాడుతూ ప్రతి నెలా శుద్ధ చవితి నాడు మోదకాలతో గణపతి హోమం లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని పర్వదినాల్లో చండీ, రుద్ర, లక్ష్మీ హోమాలు కొనసాగుతాయని, భక్తులు హాజరై తీర్థప్రసాదాల స్వీకరించాలని ఆయన కోరారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



వినుకొండ(నూజెండ్ల): ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీటి పరీక్షల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 798 సాధించిన గుడ్‌షపర్డ్ పాఠశాల పూర్వవిద్యార్థి ఎస్. మల్లికార్జున రావును ఆ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని రైల్వేపేటలో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు, ఎల్లమ్మ దంపతుల కుమారుడు మల్లికార్జునరావు తమ పాఠశాలలో చదివి పదో తరగతిలో మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 720 మార్కులకు గాను 706 మార్కులు సాధించి ఆల్ ఇండియా 798 ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం ర్యాంక్ సాధించిన మల్లికార్జునరావును, వారి తల్లిదండ్రులను పాఠశాల డైరెక్టర్స్ ఇన్నారెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు. గజవల్లి ప్రమీల విద్యార్థికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏం కొనేట్టు లేదు!!

మండిపోతున్న కూరగాయలు ధరలు



శావల్యాపురం: బహిరంగ మార్కెట్‌లో కూరగాయలు ధరలు విపరీతంగా పెరగటంతో పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలందరూ తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు ధరలు విచ్చలవిడిగా పెరగడంతో పేద ప్రజలు అగచాట్లు పడుతున్నారు. నిత్యం వివిధ రకాలు పనులు చేసుకుని కూలీలు కూరగాయలు ధరలు దాటికి పచ్చడి అన్నంతో సరిపెట్టుకుంటున్నారు. టమోటా కేజీ రూ.60 రూపాయలు, బీరకాయలు రూ.80, వంకాయలు రూ.60, క్యారెట్ రూ.80, తదితరవన్నీ కూరగాయలు ధరలు ఇష్టానుసారంగా పెరగటంతో సామాన్యులు సైతం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం రూ.500 రూపాయలకు సంచి నిండా పూర్తిస్థాయిలో నిండటం లేదు. సత్వరమే కూరగాయలు ధరలు తగ్గేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కల్యాణం.. కమనీయం

– కనుల పండువగా సీతారాముల కల్యాణం



యాగంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

పెదకూరపాడు: పెదకూరపాడులోని మహాలక్ష్మి మహా సరస్వతీ సమేత వాసవీ కన్యకాంబ త్రిశక్తి పీఠం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, వేద పండితుల మంత్రోశ్చరణలతో స్వామివారి కల్యాణం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. గ్రామస్తులు సుభిక్షంగా ఉండాలంటూ యజ్ఞ హోమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ శాశ్వత ధర్మకర్త పొట్టి నాగమల్లేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు భగవద్గీత పారాయణం చేశారు.

వేల్పూరులో పోలీసు పికెట్ ఏర్పాటు

రూరల్ సీఐ సుధాకరరావు



పోలీసు పికెట్ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న రూరల్ సీఐ సుధాకరరావు

శావల్యాపురం: గొడవలు అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకరరావు హెచ్చరించారు. సోమవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో ఎస్సీ వర్గీయులపై టీడీపీ యువకులు దాడులకు పాల్పడిన సంఘటనపై పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు స్వగ్రామంలో సార్వత్రిక ఎన్నికల్లో అత్యధికంగా ఎస్సీలు వైఎస్సార్ సీపీకు ఓట్లు వేశారని నేపంతో లెక్కింపు సందర్భంగా బూత్‌లు వారిగా మెజారిటీ వచ్చిందని ఈక్రమంలో ఆగ్ర వర్ణాలకు చెందిన టీడీపీ యువకులు ఇష్టానుసారంగా ఎస్సీలకు చెందిన ఇళ్లపై దాడులకు చేయటంతో పాటు ఇష్టానుసారంగా దూషించటం మంచి పద్ధతి కాదన్నారు. చట్టం ఎవరికీ చుట్టం కాదన్నారు. గ్రామంలో కొందరు టీడీపీ యువకులు ఇలాంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే విధంగా చర్యలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గ్రామంలో శాంతి భద్రతలు అదుపులోకి వచ్చే వరకు పోలీసు పికెట్ ఉంటుందన్నారు. ఎస్సైలు చల్లా సురేష్, లక్ష్మీ నారాయణరెడ్డి, కేంద్ర బలగాలు ఆయన వెంట ఉన్నారు.

దోమల కారణంగా మలేరియా వ్యాప్తి

రాజుపాలెం: మలేరియా వ్యాధి దోమల వలన ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల్లో ఉన్న రోళ్లు, పాత టైర్లలోని నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వేపాకు పొగ వేయడం, సాయంత్రం తలుపులు, కిటికీలు మూసి వేయడం వల్ల దోమలను నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవన్‌రావు, ఉషారాణి, రోశియ్య, మహేష్‌బాబు, కమ్యూనిటీ హెల్త్ అధికారి లక్ష్మీదుర్గ, శిరీషబాయి, శివమాధవి, ల్యాబ్ టెక్నీషియన్ రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మి, తిరుపతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

దోమల నివారణతోనే మలేరియా దూరం

రెంటచింతల: నివాస పరిసర ప్రాంతాల్లో దోమల నివారణతోనే మలేరియా దూరం చేయవచ్చునని మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. జూన్ 1 నుంచి 30 వరకు నిర్వహించనున్న మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు పురస్కరించుకుని సోమవారం రెంటచింతల వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడా రు. నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు తదితర వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా దోమ తెరలు, కిటికీలకు మెష్‌లు వాడాలని సూచించారు. పాత టైర్లు, కొబ్బరి బొండాలు ఇంట్లో ఉండకుండా ఊరికి దూరంగా పడవేయాలని చెప్పారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. జ్వరం వచ్చినప్పుడు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ప్రమీల, విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



రెంటచింతలలో ర్యాలీని నిర్వహిస్తున్న మలేరియ విభాగ అధికారులు



తొట్లలో నీటి నిల్వపై వివరిస్తున్న సిబ్బంది

నూతన విద్యా విధానంతో సాంకేతిక ప్రగతి

గుంటూరు ఎడ్యుకేషన్: నూతన జాతీయ విద్యా విధానంతో విద్యా సంస్థలు సాంకేతికంగా బలోపేతం కావాలని హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. జిలాని పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం నూతన విద్యా విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జిలాని విద్యాసంస్థల ప్రగతిని అంచనా వేసి, ప్రభుత్వ పరంగా గుర్తింపును ఇచ్చేటటువంటి నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ (ఎన్ఐఆర్ఎఫ్), నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ (నాక్)ను గురించి వివరించారు. సంబంధిత గుర్తింపు పొందడంలో అవసరమైన మౌలిక వసతులు, ప్రమాణాల గురించి చెప్పారు. ఎన్ఐఆర్ఎఫ్, నాక్ నుంచి గుర్తింపు పొందిన కళాశాలలు డీమ్డ్ యూనివర్సిటీలుగాను, తరువాత స్వయం ప్రతిపత్తిగల విద్యాసంస్థలుగా గుర్తింపు పొందేందుకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర ప్రమాణాల గురించి వివరించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ హిందూ ఫార్మసీ కళాశాల నాక్ గుర్తింపు పొందడానికి అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సదస్సుల్లో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ప్రినిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, నాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ప్రత్యూష, ఓఎస్డీ డాక్టర్ పి. సీతారామయ్య, హిందూ కళాశాల పూర్వ వైస్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జిలాని

బైక్ పై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

బెల్లంకొండ: బైక్ అదుపు తప్పి పడిపోవడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మన్నెసుల్తాన్ పాలెం గ్రామం వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై ఎస్ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎమ్మాజీ గూడెం గ్రామానికి చెందిన చందా కాళిదాస్ అనే వ్యక్తి గాయపడినట్లు తెలిపారు. బెల్లంకొండ వైపు నుంచి బైక్ పై వస్తున్న కాళీదాసు మన్నెసుల్తాన్ పాలెం సమీపంలోని చప్టా వద్దకు రాగానే బ్రేక్ వేయడంతో అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి 108కు సమాచారం అందించారు. బాధితుడిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, స్థానిక ఏవో డి. పాపకుమారిల పర్యవేక్షణలో ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లు, సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్లు, స్టాక్ నిల్వల రిజిస్టర్లను పరిశీలించారు. అనుమతులు లేకుండా విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని, విత్తనాలు అమ్మకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు స్టాక్‌ని బోర్డులో తెలియజేయాలని ఏడీఏ మస్తానమ్మ చెప్పారు. రైతులకు విత్తనాలు విక్రయిస్తే సంబంధిత రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.